# సమస్య తీరింది

"మ్యావ్! మ్యావ్!"

ఆలోచనల్లో మునిగి ఆకాశంవంక చూస్తున్న శంకరం త్రుళ్ళిపడి ఆలోచనల గొడుగులోనుండి వెలుపలబడి ఆశ్చర్యంతో ఇటూ అటూ చూశాడు. ఎదురుగా వీధిదీపం కాంతిలో కనిపించింది కుంటుతూ నడుస్తున్న పిల్లిపిల్ల.

దాని ముఖంలోని అమాయకత్వం, ఆ కండ్లలోని జాలిచూపు, కుంటికాలితో అది పడేబాధ, జాలిగొలిపే దాని అరుపు శంకరం హృదయాన్ని ద్రవింపజేశాయి. సానుభూతి ప్రకటించింది అతని మనసు. దానివంకే అట్లాగ తదేకంగా కన్నార్పకుండా చూడసాగాడు.

కుంటినడకతో మెల్లి మెల్లిగా, 'మ్యావ్ మ్యావ్' మని అరుస్తూ శంకరం కూర్చున్న అరుగెక్కింది. స్తంభంవార లైటునీడలో ఒదిగికూర్చుని శంకరం ముఖంలోకి చూడసాగింది.

శంకరంగూడ దాని నట్లాగే చూడసాగాడు. పాత ఆలోచనలన్నీ ఎచటికో పోయి అతని మనస్సంతా పిల్లిపిల్లగూర్చిన ఆలోచనలతో నిండిపోయింది. వాతావరణమంతా నిశ్శబ్దంగావుంది. ఆ ఊరికి మారుమూల వీధేమో పదిగంటలకే మాటు మణిగిపోయింది. అందరూ ఎవరిండ్లలో వారు తలుపులు బిగించుకుని గాఢనిద్రా పరవశులైనారు. దోమలబాధ భరించలేక అరుగుమీద శంకరమొక్కడే కూర్చున్నాడు. ఆ రాత్రి.

అతని బుర్రంతా ఆలోచనలతో నిండిపోయింది. అన్ని ఆలోచనలు ఆ పిల్లిపిల్లకు సంబంధించినవే! దీనితల్లి ఎక్కడుందో? పాపం! తప్పిపోయాయి కాబోలు రెండూను? లేక ఎవరైనా ఈ పిల్లిపిల్లల పోరు పడలేక బయటకుగెంటి తలుపు లేసుకున్నారేమో? ఎంత కఠినహృదయాలు వారివి? తోటిమానవుడు కష్టపడుతుంటేనే కాస్తంత సానుభూతి చూపని వీళ్లు ఒక అల్పజంతువును చూస్తారా? ఎంత మారిపోయింది కాలం? నగ్నంగా, మాడే డొక్కతో, లోతుకు...యిన కళ్లతో, ఎముకలే తప్పకండ ఏ కోశానా లేని శరీరాలతో రోడ్లవెంట తిరుగుతూ, నల్గురిచేత అసహ్యించుకోనబడుతూ హోటళ్ల ముందు పారేసిన ఎంగిలాకులకై కుక్కలతో కొట్లాడుతూ నికృష్టజీవనం గడిపే మానవు లెందరు లేరు? సహాయంకాగు, అసమం సానుభూతినయినా చూపని ఈ ప్రపంచం ఒక క్షుద్ర జంతువును, ఒక పిల్లిపిల్లను చూస్తుందా?

ఎంత జాలిగా వుంది ఆ అరుపు! తనకు పిల్లిభాషవచ్చినా బాగుండును. తన గుర్గతికి ఎంతగా విలపిస్తున్నదో? ఈ లోకాన్ని ఎంతగా తిట్టుకుంటున్నదో? ఇంతకీ ఏమైనా తిన్నదో? లేదో? బిచ్చగానికి పట్టెడన్నం పెట్టలేని మనుష్యులు పిల్లిపిల్లకు పాలేం పోస్తారు? దాని ముందుగతి దానికి తెలియదు. అర్ధరాత్రి! వీధంతా నిశ్శబ్దం! తనున్నాడు గాబట్టి సరిపోయింది గాని ఏ

## "నవ్యశ్రీ"

కుక్కైనా చూస్తే దీని గతేమిటి? శరీరం జలదరించింది శంకరానికి. అబ్బ! కళ్లు గట్టిగా మూసేసుకున్నాడు రెంతుచేతులతో.

గుండె దిటవు చేసుకున్నాడు శంకరం. ఎట్లాగైనా పిల్లిపిల్లనుద్ధరించాలని నిశ్చయించుకున్నాడు. ముందు కర్తవ్యమేమిటా అని ఆలోచించ సాగాడు. పిల్లిపిల్లను ఈ రాత్రికి తనయింట్లో వుంచుకుంటేనో? బాగానే వుంటుంది, కానీ...

...అప్పుడే దానికి ఆటంకం కలిగింది. ఇది నిద్రపోకుండా రాత్రంతా గోలచేస్తూ, అరుస్తుంటే నాన్నగారికి నిద్రాభంగమవుతుంది. అమ్మో! ఆయనకు నిద్రాభంగమవుతే ఇంకేమైనా వుంది? మూడునాలు రోజులదాకా తనకు పచ్చి మంచినీళ్ల చుక్కలు కూడ పుట్టవు! ఎంత మాట, అవమానం, ఇంకా, ఇంకా ఏవైనా భరిస్తారుగాని ఆయన నిద్రాభంగంమాత్రం భరించరు. అంచేత ఒక అల్పప్రాణికోసం తనవంటి భారమైన ప్రాణాన్ని అంత కష్టపెట్టుకోడం చాలా తెలివితక్కువ పని. అంచేత ఆ ఆలోచన ప్రక్కకు నెట్టాడు.

తన యిల్లయింది. ఇక వీధిలో మిగతా వారిండ్లమీదకు మళ్లించాడు తన దృష్టిని. ఎవరింటి తలుపైనా తీసివుంటే చల్లగా వాళ్లింట్లో వదిలేస్తేనేం? వాళ్లే పడతారు మిగతాబాధ! అయినా ఇంత అర్ధరాత్రపుడు ఎవరు తలుపులు తీసుక పడుకుంటారూ?' అన్న ప్రశ్న ఎదురయింది మొదట్లోనే. అవును! ఎవరు తలుపులుతీసుకు పడుకోరు అందరూ భద్రంగా గడియలు పెట్టుకుని కాళ్లాలుగూడా బిగించుకుని పడుకుంటారు. అందులో మూడునాల్గు నెలలాయి దొంగతనాలుకూడ జాస్తిగా వున్నాయి. అందుచేత ఆభావంకూడా రద్దుచేసుకోక తప్పలేదు. 'అయినా ప్రయత్నించి చూడకూడదా?' అంది మనసు 'అవును! నిజమే!' అనుకున్నాడు తాను.

పిల్లిపిల్లను మెడవద్ద మృదువుగా పట్టుకుని బయల్దేరాడు శంకరం, వీధి చివరదాకా వెళ్ళి చూశాడు. అందరి ఇండ్ల తలుపులూ మూసుకు నేవున్నాయి. ఆఖరికి కిటికీ తలుపులుకూడ తెరచిలేవు. తాననుకున్న దేగా! ఆపిల్లిపిల్లను చంకవేసుకుని తిరిగి తమ అరుగుమీదకొచ్చి కూర్చున్నాడు.

అనునయంగా దాని వీపుమీద నిమురుతూ ఆలోచించసాగాడు శంకరం. దీనిని ఎట్లా రక్షించాలా అన్నది సమస్యయి కూర్చుంది. ఇంతలోకే ఎదురు అరుగుమీదనుండి చెవులు బ్రద్దలుచేసే 'ఓం'కారం వినిపించింది. త్రుళ్ళిపడి అటుదృష్టి సారించాడు ఎదురుగా వున్న 'సీతయ్య'గారి పాడుబడిన అరుగు మీదనుండి రెండు గాడిదలు రోడ్డుమీదకు దూకి పరుగుపందె మారంభిచాయి

ఒకసారి అతనికిపోయిన ఆశ తిరిగి కలిగింది. ముఖంమీద మందహాసం వెలిసింది. తనకు దారిచూపించిన ఆగాడిదలకు మనసులోనే ధన్యవాదము లర్పించుకున్నాడు. 'ఆహా! ఖరోత్తములారా! మీ మేలు ఈ జన్మంలో మరిచిపోగలనా? నడి సముద్రంలో మునిగేపడవలో, హోరుగాలిలో దారి తెన్నూ తెలియక కొట్టుమిట్టాడుతున్న నాకు చక్కనిదారి చూపించి అనుగ్రహించారు. మహానుభావులు మీరు! ఊరికే పట్టుకున్నాడా భగవంతుని తండ్రి వసుదేవుడు మీ పూర్వీకుల పాదపద్మములు?! ఇవే నా ధన్యవాదములు!'

(47-వ పేజీ చూడండి)

# ★ సమస్య తీరింది ★

(34 వ పేజీ తరువాయి)

అనుకుని తనకు తట్టిన అమోఘమైన ఊహని ఆచరణలో పెట్టేయ నిశ్చయించుకున్నాడు. పిలిపిల్లను చంక నిరుకుని ఒక్క గంతులో ఆయింటి అరుగుమీద వ్రాలాడు, యింటి తలుపులు నెట్టి చూశాడు. ఊహూఁ! రాలేదు. వుత్సాహం ఒక్కసారిగా చల్లారిపోయింది. 'హోసినినిన్ తగలెట్టా! యింట్లో ఏముందనే తలుపులు తాళాలుగూడా బిగించుక వచ్చావ్ ఎక్కడికో?!' అని తిట్టుకుంటూ ఆ అరుగు మీగే కూలబడ్డాడు. పిల్లిపిల్లను ఒళ్లో పెట్టుకుని విచారిస్తూ కూర్చున్నాడు. ఇంతలో ఎదురుగా వకీలుగారింటి గోడలో సైడు కాలువలోకి నీరుపోయే తూము కనిపించింది. అతను ఆనందపరవశుడై పోయాడు. 'ఇంక నీకేం భయంలేదమ్మా!' అని పిల్లిపిల్ల నొకసారి బుజ్జగించాడు. వెంటనే పోయి పిల్లిపిల్లను మెల్లగా, దెబ్బతగలకుండా ఆతూము లోనుండి లోపలికినెట్టి ఇక పరవాలేదని నిర్ణయించుకునీ లేచి నిలబడ్డాడు సంతృప్తితో ఎగురుమీదనుండి కారే చెమటను తుడుచుకుంటూ ఆనందంతో వెనుదిరిగాడు. రెండడుగులు వేశాడో లేదో 'మ్యావ్. మ్యావ్!' మంటూ పరుగు పరుగునవచ్చి కాళ్ళనువాటేసుకుంది పిల్లిపిల్ల. అతనిలో ఒక మూలకోపం, ఒకమూల ఏడుపూ ఒక్కసారిగా ఉద్భవించాయి.

తారుమారయ్యాయి తన అంచనాలు! కసి కొద్ది కాలితో ఒక్క తాపు తన్నాలనిపించింది. ఆపిల్లిపిల్లను. కోపంగా దాని వంక చూశాడు. అమాయకమైన దానిచూపులు, జాలిగొలిపే దాని అరుపు అతనిలో కోపాన్ని ఒక్కసారిగా జాలిగామార్చేశాయి. దానిని మళ్లీ తిరిగి చంక నెత్తుకుని అరుగుమీదొచ్చి కూలబడ్డాడు. మళ్ళీ పరిస్థితి మామూలే! ఎక్కడవున్నావే గొంగళీ అంటే వేసిన చోటే వున్నాననే సామెతయింది శనపని!

తిరిగి ఉపాయాంతారాన్ని అన్వేషించసాగాడు. కాని ఇంతలోనే మరో చిన్న విషయం జ్ఞప్తికొచ్చింది. 'శీతయ్య' గారి పాడుబడ్డ ఇంటివీధి కొట్టు తెఱచే వున్నట్లు చూశాడు రెండు మూడు రోజుల క్రితం. ఇందాక తనకు జ్ఞప్తికే రాలేదు. ఆ చీకటిలో ఆ కొట్టు తనకు కన్పించలేదుగూడ.

శంకరం పిల్లిపిల్లతో సహా మళ్ళా లేచాడు. మళ్ళీ అతనిలో పోయిన వుత్సాహం ప్రవేశించింది. 'శీతయ్య' గారి వీధికొట్టు సమీపించాడు మెల్లిగ తడుముకుంటూ. తలుపు నెట్టి చూశాడు. తెరిచే వుంది. తలుపు తీసి లోపలికి తొంగి చూశాడు. గాఢాంధకారము! నిశ్శబ్దం! తలుపు తడిమిచూశాడు. గొళ్ళెం కూడా బాగానేవుంది. తలుపు గట్టిగానే వుంది. 'నీ అదృష్టం బాగుందిలే!' అని దాన్ని బుజ్జగించాడు. దానిని మెల్లిగా ఆ కొట్లో వదిలిపెట్టి తలుపులాగి బయట గొళ్ళెం పెట్టి సంతృప్తితో గూడిన ఒక భారమైన నిట్టూర్పు విడిచి బయటపడ్డాడు. 'నీ ఇల్లు పాడుపడితే పడిందిగాని యెన్ని అనాథ జీవరాసులకు ఆశ్రయమవుతున్నదో శీతయ్యా! నువ్వు చాల పుణ్యాత్ముడిలివి!' అనుకుంటూ తేలిక పడిన గుండెలతో ఇంట్లో కొచ్చి ప్రక్కమీద వ్రాలాడు.

ఇట్లా పడుకున్నాడో లేదో మళ్ళీ దాని అరుపు వినిపించిందతనికి. ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. టపటపా కొట్టుకునే గుండెలతో వినసాగాడు. ఆ అరుపు క్రమక్రముగా దగ్గరై మళ్ళీ దూరమవసాగింది. అతని మనసును ఆశ్చర్యం, కోపం, భయం, ఒక్కసారిగా పెనవేసుకుని అతన్ని ఉక్కిరి ఒక్కిరి చేయసాగాయి. తానంత గట్టిగా గొళ్లెంబిగించితే ఈ వెధవగొడ్డు ఎట్లా బయటపడిందా అన్న సందేహం బాధించసాగింది. గబగబా లేచిపోయి నేరుగా ఆ కొట్లోనే పోయి పరీక్షించాడు. ఒకమూల పెద్ద పందికొక్కు కన్నమొకటి కనిపించింది. 'అన్న' అని నాలిక కరుచుకున్నాడు. గబగబా వీధిలోకి వచ్చాడు. అపుడే పిల్లిపిల్ల చాలా దూరం పోయింది. దూరంగా దాని అరుపు వినిపించసాగింది. సందుచివర లైటులో స్పష్టంగా కుంటుకుంటూ నడుస్తున్న దాని ఆకారం కనిపించింది.

అతని హృదయంలో చెప్పలేని ఆరాటం బయల్దేరింది. దానిమీద ఎక్కడలేని జాలి, ప్రేమ, మమకారము అతనిలో కట్టలు త్రెంచుకు ప్రవహించాయి. ఆ ప్రవాహంముందు అన్ని ఆటంకాలు, భయాలుగూడ నిలువలేకపోయాయి. నాన్నగారు కాదన్నాగూడా, తానెన్ని కష్టాలు పడైనా సరే దాని కా రాత్రి, ఆ రాత్రేకాదు! ఇంక సదా తనింట్లోనే దాని కాశ్రయమివ్వాలని కృతనిశ్చయుడై ముందుకు నడవసాగాడు గబగబా! ఇంతలో ఒకకుక్క అరుపు, వేగంగా పక్కవీధులోనుండి శరవేగంతో పడుగెడుతున్న కుక్క ఆకారం ఎలక్ట్రిక్ లైటు కాంతిలో అతనికి గోచరమయ్యాయి. అతనిలో ఆరాటము, ఆందోళన, భయం అధికమయ్యాయి. గబగబా పరుగిడసాగాడు. ఇట్లా సందు తిరిగాడో లేదో భయంకరంగా అరిచిన పిల్లిపిల్ల అరుపు వినిపించింది. అంతే. నిశ్శబ్దం. మళ్లీ శబ్దంలేదు. అదేకుక్క తనముందునుంచే పరుగెత్తి పోయింది మళ్లీ.

వణికేకాళ్ళతో, వేగంగా స్పందించే హృదయంతో, ఆపుకుందామనుకున్నా ఆగక ప్రవహించే కన్నీటితో తడబడే అడుగులతో వెళ్ళి చూశాడు శంకరం. ఎలక్ట్రిక్ దీపం క్రింద సైడ్ కాలువ ప్రక్క రక్తపు మడుగులో పడివున్నది పిల్లిపిల్ల కళేబరం! క్షణం క్రితందాకా తనకు ఎడతెగని సమస్యయై కూర్చున్న పిల్లిపిల్ల కళేబరం! సంతత ధారాపాతంగా కారే కన్నీళ్ళలో నుండి మసక మసకగా కనిపించింది ఆ భయంకరమైన దృశ్యం! మనస్సులోనే 'సమస్య తీరింది!' అని గొణుగుకున్నాడు. రెండు చేతులతో ముఖం కప్పుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ ఇంటివైపు పరుగుతీశాడు శంకరం.

★

